సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 20 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.9.50

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9.50 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/22.1°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. రాగల రెండు రోజులూ వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

న్యూస్‌రీల్

రైతులకు మెరుగైన సేవలు

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అనంతపురంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సహకార రంగాన్ని ప్రోత్సహిస్తున్నందున అవకాశాలను డీసీఎంఎస్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ, అమ్మకాలు మరింత పెరగాలని సూచించారు. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.6.78 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. ఈ ఏడాది రూ.20 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. యూరియా, డీఏపీ, ఇతరత్రా ఎరువులకు డిమాండ్ ఉన్నందున వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా తగినంత ఎరువులు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మా రామిరెడ్డి, డైరెక్టర్లు వై.జనార్దన్‌రెడ్డి, బి.శ్రీరామరెడ్డి, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు 30లోపు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (డొమెస్టిక్, నాన్ వాయిస్) కోర్సులో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీలోపు స్కిల్ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9676706976 నంబర్లో సంప్రదించాలన్నారు.

8 మండలాల్లో వర్షం



మరువ పారుతున్న సాహెబ్ చెరువు

పుట్టపర్తి అర్బన్: వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతోంది. పుట్టపర్తి మండలంలోని వీరాంజనేయపల్లి వద్ద ఉన్న సాహెబ్ చెరువు, బ్రాహ్మణపల్లి చెరువులు మరువ పారాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇక మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోని 8 మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా కదిరి మండలంలో 39.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఓడీ చెరువు 35.2, గాండ్లపెంట 32.4, ఎన్‌పీ కుంట 26, నల్లమాడ 9.2, నల్లచెరువు 2.2, తలుపుల, అమడగూరు మండలాల్లో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

కొర్రపాడు పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు



కొర్రపాడు పీహెచ్‌సీ

బుక్కరాయసముద్రం: కొర్రపాడు పీహెచ్‌సీకి జాతీయస్థాయి గుర్తింపు లభించిందని డాక్టర్ హర్ష తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం పీహెచ్‌సీని సందర్శించింది. ఇక్కడ ఉన్న అన్ని విభాగాలూ 89.19 శాతం క్వాలిటీ సాధించినందున కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. బుధవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య అధికారులకు, పీహెచ్‌సీ సిబ్బందికి డాక్టర్ శ్రీహర్ష కృతజ్ఞతలు తెలిపారు.

బతుకు బండికి..ఇంధనం



ఇతని పేరు రమేష్. మడకశిర మండలం హరేసముద్రం. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏటా బండి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌కు కావాల్సిన డబ్బు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవాడు. కానీ 2019లో సీఎం జగన్ 'వాహన మిత్ర' పథకం తీసుకురావడంతో తన కష్టాలు తొలగాయని ఆనందంగా చెబుతున్నాడు. తనకు నాలుగు విడతల్లో వాహనమిత్ర ద్వారా రూ.40 వేలు లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశాడు.

ఈయన అబ్దుల్ రవూఫ్ ఖాన్. పరిగి మండల కేంద్రంలో పాతికేళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజంతా సంపాదించినా కుటుంబ పోషణకే సరిపోయేది. దీంతో ఇన్సూరెన్స్, ఎఫ్‌సీ కోసం అప్పు చేసేవాడు. ప్రస్తుతం 'వాహనమిత్ర' సాయంతో బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహన మరమ్మతులు చేయించుకుంటున్నట్లు తెలిపాడు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయనంత సాయం వైఎస్ జగన్ చేస్తున్నారని చెబుతున్నాడు.



- ఐదో విడత వాహనమిత్రకు శ్రీకారం
- రేపు ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లాలో సుమారు 5 వేల మందికి లబ్ధి

సాక్షి, పుట్టపర్తి

నిరుపేదల బతుకుబండికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇం'ధనం' పోస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆటో, మ్యాక్సీ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న డ్రైవర్లకు అండగా నిలుస్తున్నారు. 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం ద్వారా ఏటా రూ.10 వేల సాయం అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల్లో సాయం అందించారు. తాజాగా ఈ నెల 29న ఐదో విడత వాహనమిత్ర సాయం అందించేందుకు సిద్ధమయ్యారు. దీంతో వాహనానికి బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చిన్నపాటి మరమ్మతులకు ఇబ్బందులు లేకుండా పోయాయని ఆటో, ట్యాక్సీ వాలాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు రూ.17.91 కోట్లు

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ 'వాహనమిత్ర' కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నాలుగు విడతల సాయం అందించారు. మొత్తంగా నాలుగు విడతల్లో 17,910 మందికి రూ.17.91 కోట్ల లబ్ధి చేకూరింది. 2019–20లో 3,033 మందికి, 2020–21లో 5,036 మందికి, 2021–22లో 4,842 మందికి, 2022–23లో 4,999 మందికి వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధి కలిగింది. నాలుగు విడతల్లోనూ లబ్ధి పొందిన వారూ ఉన్నారు. వాహనమిత్రతో పాటు మరిన్ని పథకాలు కూడా తమ కుటుంబ సభ్యులకు వర్తిస్తున్నాయంటూ డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వాహన మిత్ర సొమ్ముతో ఆటో ఫిట్‌నెస్ చేయించుకున్న ఆనందంలో మహిళా డ్రైవర్ (ఫైల్)

నిర్వహణ ఖర్చులకు భయం లేదు



ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు అందజేస్తున్నారు. నేను నాలుగు విడతల్లో లబ్ధి పొందాను. దీంతో వాహన నిర్వహణ ఖర్చులకు ఇబ్బంది లేకుండా పోయింది. అర్హతే ప్రామాణికంగా సాయం అందిస్తున్నారు. మాలాంటి వారి గురించి ఆలోచించి మేలు చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– దాసరి ఆంజనేయులు, హిందూపురం

29న ఖాతాల్లో నగదు జమ



ఈనెల 29న ఐదో విడత వాహన మిత్ర సాయం అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ జిల్లాకు సంబంధించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులందరికీ పథకం వర్తింపజేశాం. ఈసారి ఎండీయూ (రేషన్ వాహనాలు) ఆపరేటర్లకు కూడా వాహనమిత్ర సాయం అందనుంది.

– ఎస్ఎస్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లు)
2019 -20	3,033	3.033
2020 - 21	5,036	5.036
2021 - 22	4,842	4.842
2022 - 23	4,999	4.999

గీత దాటితే వేటు తప్పదు!

- పోలీసులను హెచ్చరించిన ఎస్పీ మాధవరెడ్డి



గోరంట్ల పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

గోరంట్ల/తనకల్లు: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ శాఖకు చెడ్డపేరు తెచ్చే పోలీసులపై వేటు వేసేందుకు కూడా వెనకాడబోమని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా గోరంట్ల, తనకల్లు పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరు గురించి స్టేషన్ హౌస్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో పాటు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోరంట్ల ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని పలువురు విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

పెనుకొండ సీఐ సివిల్ పంచాయితీలు నిర్వహిస్తున్నట్లు గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేయిస్తున్నామని, నివేదిక అందగానే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గోరంట్ల సీఐ సుబ్బరాయుడు, తనకల్లు ఎస్ఐ రాంభూపాల్, ఏఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కేటుగాడు దొరికాడు

- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు బురిడీ
- రూ.లక్షలు దండుకుని ఉద్యోగం చూపని వైనం
- 4 రోజుల క్రితం కుప్పం స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు
- నిందితుడు రాయచోటి శశిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



రాయచోటి శశి

అనంతపురం క్రైం: ఉద్యోగాలిప్పిస్తామని రూ.లక్షలు దండుకుని ముఖం చాటేసిన మోసగాడు రాయచోటి శశిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడు బీటెక్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలిప్పిసామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 150 మందిని మోసగించాడు. జిల్లాల వారీగా ఏజెంట్లను నియమించి వారి ద్వారా నిరుద్యోగుల నుంచి డబ్బు దండుకున్నాడు. నాలుగు రోజుల క్రితం పలువురు బాధితులు కుప్పం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు బుధవారం ఉదయం రాయచోటిలోని తన స్వగృహంలో ఉన్న నిందితుడు శశిని అదుపులోకి తీసుకున్నారు. కుప్పంలోని బాధితులకు మాత్రమే డబ్బు తిరిగిస్తానని నిందితుడు చెప్పినట్లు ఏజెంట్ల ద్వారా తెలుస్తోంది. అదే జరిగితే అనంతపురం జిల్లాతో పాటు మిగిలిన ప్రాంతాల్లోని బాధితుల పరిస్థితి ఏంటనేది అగమ్యగోచరమే. ఏజెంట్లు బలమైన సామాజికవర్గానికి చెందినవారు కావడంతో డబ్బు రికవరీపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. డబ్బు కోసం నిలదీస్తే ఏజెంట్లు టీడీపీకి చెందిన నాయకుల పేర్లు చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారని వాపోతున్నారు. వీరికి అల్లరిమూకలు, రౌడీషీటర్లు అండగా ఉండటంతో ఒత్తిడి చేయలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

ఖతర్నాక్ లేడీ బెదిరింపుల పర్వం..

ఉద్యోగాలిప్పిస్తామని తమ నుంచి తీసుకున్న నగదు తిరిగివ్వాలని అడిగిన నిరుద్యోగులను 'ఖతర్నాక్ లేడీ' పోలీసుల ద్వారా బెదిరిస్తోంది. నెల క్రితం అప్పటి అనంతపురం ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు కొంతమంది నిరుద్యోగులు తమకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. బెంగళూరుకు చెందిన సదరు మహిళ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి లక్షలాది రూపాయలు డబ్బు తీసుకుందని ఆరోపించారు. ఏడాది దాటినా ఉద్యోగం చూపకపోవడంతో బాధితులు ఆ మహిళను నిలదీసి డబ్బు కోసం ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు మహిళ వైఎస్సార్ జిల్లా పోలీసుల ద్వారా బాధితులను బెదిరింపులకు గురి చేస్తోంది. మహిళకు ఎందుకు ఫోన్ చేస్తున్నారంటూ పోలీసులు ప్రశ్నిస్తుండటంతో.. బాధితులు నేరుగా పోలీసుల వద్దకు వెళ్లి జరిగిన విషయం తెలిపారు. అయితే న్యాయస్థానంలో కేసు వేసుకోండని పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని బాధితులు తెలిపారు.

ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం

- గ్రామస్థాయి సమస్యలకు మండల స్థాయిలోనే చర్యలు
- 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ అరుణ్‌బాబు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు

పుట్టపర్తి: ప్రజల సౌకర్యార్థం మండల స్థాయిలోనే జిల్లా అధికారులతో కలిసి నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపుతామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం బుక్కపట్నంలోని షాదీఖానాలో 'జగన్ననకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై మొత్తం 100 వినతులు అందగా, కలెక్టర్ అరుణ్‌బాబు, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ కొండయ్య, జిల్లా భూగర్భజల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమానికి రాలేని వారి కోసమే మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాలో ఒక్కో రోజు ఒక్కో మండలంలో 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రామస్థాయి సమస్యలంటికీ మండల స్థాయిలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా పరిష్కారం చూపుతున్నామన్నారు. మండల అధికారులు కూడా అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

'జగనన్నకు చెబుదాం'లో అందే అర్జీలను ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా కనీసం గంట పాటు శ్రమదానం చేయాలన్నారు. అలాగే ఈ నెల 30వ తేదీన చేపట్టనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


'జగనన్నకు చెబుదాం'లో అందిన అర్జీల్లో కొన్ని...

- బుక్కపట్నం పంచాయతీ విభజన సందర్భంగా అధికారులు సమన్యాయం చేయలేదని బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మి, గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుక్కపట్నం పంచాయతీలో 8 వేల మంది జనాభా ఉండగా, కేవలం 1,141 ఎకరాలు మాత్రమే కేటాయించారని, అదే బుచ్చయ్యగారిపల్లి పంచాయతీకి 6 వేల ఎకరాలు కేటాయించారన్నారు. పరిశీలించి తగు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.
- తన భూమి 2 ఎకరాలను 2007లో అధికారులు హంద్రీ నీవా కాలవ కోసం సేకరించారని, ఇంతవరకూ పరిహారం అందించలేదని బుక్కపట్నం ఇందిరానగర్‌కు చెందిన రైతు ఓబిలేసు కలెక్టర్‌కు తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.
- జిల్లేడుబండ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇవ్వలేదని పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బుక్కపట్నం చెరువు పరిశీలన

కలెక్టర్ అరుణ్‌బాబు ఇరిగేషన్ ఈఈ గంగాధర్ బుక్కపట్నం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చెరువు భౌగోళిక అంశాలు, నీటి నిల్వ, క్యాచ్‌మెంట్ ఏరియా తదితర అంశాలను ఆరా తీశారు. 2,200 ఎకరాల విస్తీర్ణంలోని చెరువులో ఒక టీఎంసీ నీరు నిల్వ ఉంటుందని అధికారులు తెలపగా, నీటి నిల్వసామర్థ్యం పెంచే ప్రణాళికల గురించి కలెక్టర్ అధికారులతో చర్చించారు.

వ్యయప్రయాసలు తగ్గాయి



ఏదైనా సమస్యపై అర్జీ ఇవ్వాలంటే గతంలో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా మండల కేంద్రంలోనే 'జగనన్నకు చెబుదాం' గ్రీవెన్స్ నిర్వహించడం వల్ల వ్యయప్రయాసలు తగ్గాయి. పైగా మా మండల వాసులకు మాత్రమే అవకాశం ఉండటంతో అధికారులు కూడా చాలా ఓపిగ్గా సమస్యలు వింటున్నారు. మా భూమిపై రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లతో కనిపిస్తోంది. అర్జీ ఇవ్వగా అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు.

– అరుణ, నార్శింపల్లి, బుక్కపట్నం మండలం

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



ఎస్సీల శ్మశాన వాటిక కోసం స్థలం కావాలని గతంలో అనేకసార్లు మండల కేంద్రంలో అర్జీలిచ్చినా పరిష్కారం కాలేదు. ఇప్పుడు కలెక్టర్ సారుకు వినతి పత్రం అందించాం. స్పందించిన ఆయన తప్పక స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులే మా వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామం.

– గంగులప్ప, ఎస్సీ కాలనీ, బుచ్చయ్యగారిపల్లి

పర్యాటకం పరిఢవిల్లాలి

- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి టౌన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లేపాక్షి, అతిపెద్ద తిమ్మమ్మ మర్రిమాను, చారిత్రక వేమన సమాధులు, శిల్పకళా వైభవాన్ని చాటే కోటలు, విజయనగర రాజుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కట్టడాలు ఇలా...మన జిల్లాలో పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. దర్శనీయ ప్రదేశాలు, క్షేత్రాలను మరింత అభివృద్ధి చేసి జిల్లాలో పర్యాటకం పరిఢవిల్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయి ఆరామం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిఆరామంలో టూరిజం శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా దర్శనీయ ప్రదేశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ భాగ్యరేఖ, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాల, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టూరిజం అధికారిగా ఎంపికైన నాగేశ్వర్‌రెడ్డిని కలెక్టర్, ప్రజాప్రతినిధులు పూలమాల, శాలువతో సన్మానించారు.





జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ (ఇన్‌సెట్) విద్యార్థినికి సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పర్యాటక ప్రాంతాలను సందర్శించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... చరిత్ర, సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే దర్శనీయ ప్రదేశాలు జిల్లాలో చాలానే ఉన్నాయన్నాయన్నారు. అందులో లేపాక్షికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడం మనమందరం గర్వించదగ్గ విషయమన్నారు. పర్యాటక ప్రాంతాలు దర్శించడం వల్ల విభిన్న సాంప్రదాయాలు, సంస్కృతుల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల విద్యార్థులంతా దసరా సెలవుల్లో కుటుంబీకులతో కలిసి పర్యాట ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. అనంతరం 'పుడా' చైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి మాట్లాడుతూ....జిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఇరిగేషన్ అధికారి సుదర్శన్, చిత్రావతి బోటింగ్ యజమాని రమేష్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, సాయిటవర్ యజమాని పద్మనాభంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన వారందరూ ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు పిలుపునిచ్చారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలో బుధవారం చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. జిల్లా అంతటా ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందన్నారు. ఇప్పటి వరకూ ఈ-క్రాప్ నమోదు చేయించని రైతులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు తప్పనిసరిగా ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఆర్‌బీకే అసిస్టెంట్ లావణ్య పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామ చెరువులో బుధవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 40 ఏళ్ల పైబడిన పురుషుడి మృతదేహంగా గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు.

వ్యక్తి అరెస్ట్

సోమందేపల్లి: అత్యాచార యత్నం కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. ఈ నెల 20న మండలంలోని నాగినాయని చెరువు గ్రామ చెరువు వద్ద ఆవులు మేపుతున్న మహిళపై అదే గ్రామానికి చెందిన రంగనాథ్ అత్యాచారానికి ప్రయత్నించాడు. మహిళ కేకలు వేయడంతో చంపుతానని బెదిరించాడు. ఘటనకు సంబంధించి బాధితురాలు ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సమగ్ర విచారణ అనంతరం పక్కా ఆధారాలతో నిందితుడు రంగనాథ్‌ను బుధవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పట్టపగలే చోరీ

పెనుకొండ: పట్టపగలే ఓ ఇంట్లో దుండగులు చొరబడి విలువైన సామగ్రి అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో నివాసముంటున్న నరేష్, భార్యతో కలసి బుధవారం ఉదయం పిల్లలను పాఠశాలలో వదిలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. విద్యుత్ దీపాలకు నల్లరంగు పూసి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న 15 తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు అపహరించుకెళ్లారు. మధ్యాహ్నం తర్వాత ఇంటికి చేరుకున్న నరేష్ దంపతులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.


విశ్వ చైతన్య శక్తి.. పుట్టపర్తి

- పట్టుమని పది కిలోమీటర్ల విస్తీర్ణం కూడా లేకున్నా ప్రపంచ ఖ్యాతి
- జిల్లాలోనే అతి చిన్న మున్సిపాలిటీ
- ప్రపంచ దేశాల నుంచి భక్తులు, పర్యాటకుల రాకపోకలు

సాక్షి, పుట్టపర్తి: సత్య, ధర్మ ,శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవతా విలువలను పాటించిన వారే నిజమైన మానవులనీ, అవే మానవ జాతికి ముక్తి కలిగించేవనీ ప్రవచించిన భగవాన్ సత్యసాయిబాబా నడియాడిన పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. పట్టుమని చుట్టూ పది కిలోమీటర్ల విస్తీర్ణం కూడా లేని కుగ్రామం విశ్వ చైతన్య శక్తిగా ఎదిగింది. జిల్లాలోనే అతి చిన్న మున్సిపాలిటీగా ఉన్న పుట్టపర్తి.. నేడు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా అందరినీ దృష్టిని ఆకట్టుకుంటోంది. దీంతో పర్యాటకులు, సత్యసాయి భక్తులతో పాటు జిల్లా కేంద్రంలోని వివిధ కార్యాలయాలకు పనులపై వచ్చే వారి సంఖ్య పెరిగింది.

అటు కొత్తచెరువు... ఇటు బుక్కపట్నం

పుట్టపర్తికి ఓ వైపు బుక్కపట్నం చెరువు.. మరో వైపు కొత్తచెరువు ఉంటాయి. కేవలం పది కిలోమీటర్ల వ్యవధిలోనే మూడు మండల కేంద్రాలు ఉండడం మరో విశేషం.భగవాన్ సత్యసాయిబాబా నడియాడిన ప్రాంతం కావడంతో పుట్టపర్తిలో నివసించేందుకు చాలా మంది ఇష్టపడుతుంటారు. దీంతో ఆధునాతన ఎత్తైన భవంతులు వెలిసాయి.


పచ్చని కొండల మధ్య కనిపిస్తున్న పుట్టపర్తి . (ఇన్‌సెట్) పుట్టపర్తి ఏరియల్ వ్యూ

మాంసాహారం నిషేధం..

ఇతర రాష్ట్రాలకు చెందిన వారు, విదేశీయులు నెలల తరబడి పుట్టపర్తిలోనే మకాం ఉంటారు. ఫలితంగా పుట్టపర్తి భిన్న సంస్కృతులకు నిలయంగా మారింది. దేశవిదేశీయులు మెచ్చే వంటకాలను ఇక్కడ రుచి చూడవచ్చు. అత్యధికంగా తమిళనాడు, కేరళ శైలి వంటకాలు లభ్యమవుతాయి. ఇక క్రిస్పీగా ఉంటూ కాస్త కారంతో ఉండే ఫాస్ట్‌ఫుడ్ అంటే విదేశీయులు ఎక్కువగా మక్కువ చూపుతుంటారు. అయితే కుగ్రామంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ పుట్టపర్తిలో మాంసాహారం పూర్తిగా నిషేధం. కనీసం కోడి గుడ్డు కూడా ఇక్కడ లభ్యం కాదు. అలాగే సినిమా థియేటర్లూ ఉండవు. జిల్లా కేంద్రమే అయినా బార్లు, రెస్టారెంట్లు, మాంసం విక్రయాలకు అనుమతుల్లేవు. అత్యంత పవిత్ర ప్రాంతంగా నేటికీ భావిస్తూ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. చాలా హోటళ్లలో బర్గర్, పిజ్జాలతో పాటు పలు రకాల శాకాహార వంటలు అందుబాటులో ఉంటాయి.

ఓ వైపు నుంచి చూడాల్సిందే..

కొత్తచెరువు, బుక్కపట్నం మండల కేంద్రాలకు పుట్టపర్తికి మధ్యలో బుక్కపట్నం చెరువు ఉంటుంది. ఈ చెరువు చుట్టూ ఓ వైపు పుట్టపర్తి, మరోవైపు కొత్తచెరువు, ఇంకోవైపు పుట్టపర్తి ఉంటాయి. మూడు మండల కేంద్రాలు పది కిలోమీటర్ల పరిధిలోనే ఉంటాయి. అయితే ఎటు వైపు నుంచి చూసినా పుట్టపర్తి కనిపించదు. చుట్టూ కొండలే కనిపిస్తాయి. కేవలం 'బుక్కపట్నం - నల్లమాడ' మార్గంలో నుంచి మాత్రమే పుట్టపర్తిని దూరం నుంచి చూసే అవకాశం ఉంది. పుట్టపర్తి ముఖచిత్రం చూడాలంటే ఏరియల్ వ్యూ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. పుట్టపర్తికి ఓ వైపు చిత్రావతి నది, మరో వైపు విమానాశ్రయం, ఇంకోవైపు చెరువు సరిహద్దులుగా ఉంటాయి.


ప్రధాన గోపురం వద్ద విదేశీయురాలి సందడి

రెండు నెలలు ఉందామనుకున్నా..



నేను 2022 డిసెంబరులో పుట్టపర్తికి వచ్చాను. రెండు నెలలు ఉండి వెళ్దామనుకున్నా. అయితే ఈ ప్రాంత సంప్రదాయాలు నచ్చడంతో ఇక్కడే ఉంటున్నా. సొంతూరు వెళ్లాలనిపించడం లేదు. తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా. ఇక్కడి వంటకాలు బాగున్నాయి. – ఆండ్రూ, మాస్కో

చక్కటి నివాసయోగ్యం



పుట్టపర్తి చాలా ప్రశాంతంగా ఉంది. ఇక్కడి క్రమశిక్షణ బాగుంది. ఎక్కడికి వెళ్లినా ఇక్కడి బారు బాగా గౌరవిస్తారు. విదేశీయులమైనప్పటికీ అందరూ సహకరిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేదు. చక్కటి నివాస యోగ్యంగా చెప్పవచ్చు. – అర్టమ్, రష్యా

ఫుడ్ నచ్చింది



పుట్టపర్తిలో ఫుడ్ బాగుంది. ఏ హోటల్‌కు వెళ్లినా మాకు నచ్చే వంటకాలు లభిస్తున్నాయి. విదేశీయుల రుచికి తగిన వంటకాలను సిద్ధం చేసి పెడుతున్నారు. పిజ్జా, బర్గర్లతో పాటు గోబి, పానీపూరి వంటకాలకు అలవాటు పడ్డాం. – వేలంటాయిన్, రష్యా

రద్దీ పెరిగింది



బాబా నిర్యాణం అనంతరం భక్తులు తగ్గారనేది అవాస్తవం. జిల్లా కేంద్రం అయ్యాక ప్రజల రద్దీ పెరిగింది. పుట్టపర్తిని శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు రుణపడి ఉంటారు. – ఆర్‌జే రత్నాకర్ రాజు, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ

దారి కోసం దాయాదుల పోరు

- వేటకొడవళ్లతో పరస్పర దాడి

పామిడి: పొలానికి వెళ్లే దారి విషయంగా దాయాదులు గొడవపడి వేటకొడవళ్లతో పరస్పర దాడులు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన చాకలి చెన్నప్ప, చాకలి నరసింహులు, చాకలి లింగన్న, చాకలి జయన్న, చాకలి గోపాల్ అన్నదమ్ములు. వీరిలో చెన్నప్ప, నరసింహులు చనిపోయారు. నరసింహులు భార్య మంగమ్మ, కుమారులు వన్నూరుస్వామి, మహేష్, సునీల్‌తో కలసి వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలోనే లింగన్న పొలానికి అనుకుని ఉన్న శివాయి భూమిని మంగమ్మ కుటుంబం కొనుగోలు చేసి, పంటల సాగు చేపట్టింది. దీంతో మా భూమిలోకి లింగన్న పొలం మీదుగా మంగమ్మ కుటుంబసభ్యులు రాకపోకలు సాగిస్తూ వచ్చారు. అయితే తమ పొలం మీదుగా రాకపోకలకు లింగన్న, గోపాల్ కుటుంబసభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో దారి విషయంగా వివాదం చోటు చేసుకోవడంతో ఇరు కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఇటీవల దారి విషయంగా తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి విచారణ చేపట్టారు. బుధవారం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని వేటకొడవళ్లతో పరస్పర దాడులకు దిగారు. ఘటనలో మంగమ్మ కుమారుడు వన్నూరు స్వామి ముఖానికి, నుదురుకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పామిడిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీజీహెచ్ క్యాజువాలిటీలో ఐసీయూ సేవలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని క్యాజువాలిటీలో ఐసీయూ సేవలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగానికి వచ్చే క్లిష్టమైన కేసులను ఐసీయూలో ఉంచి చికిత్స అందజేయనున్నట్లు తెలిపారు. అవసరానికనుగుణంగా వెంటిలేటర్, ఇతర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ప్రస్తుతానికి రెండు పడకలను ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో మరో మూడు పడకలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం రేడియాలజీ విభాగంలో డిజిటల్ రేడియోగ్రఫీ సిస్టమ్(డీఆర్)ను ప్రారంభించారు. విజయవాడకు చెందిన రేడియాలజిస్టు డాక్టర్ కులదీప్ రూ.13 లక్షలు విలువ చేసే డీఆర్ సిస్టమ్‌ను జీజీహెచ్‌కు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.


ఐసీయూలో ఏర్పాటు చేసిన పడకలను పరిశీలిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

పాలిటెక్నిక్ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అక్టోబర్ మూడో తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరే విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు (విద్యాదీవెన, వసతి దీవెన వంటి) అర్హులుకారు. స్పాట్ అడ్మిషన్లకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని హాజరు కావాలని సూచించారు. మొదటి ప్రాధాన్యత పాలిసెట్-2023 ఉత్తీర్ణులై ర్యాంక్ సాధించిన వారికి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందాలనుకునేవారు ఏ ఇతర పాలిటెక్నిక్ కళాశాలలోనూ చేరి ఉండకూడదన్నారు.

గాయపడిన మరో ఇద్దరూ మృతి

పావగడ: తాలూకాలోని మంగళవాడ గ్రామం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మంగళవారం రాత్రి రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనంపై ఉన్న చిక్కతిమ్మనహట్టికి చెందిన దర్శన్ (24) దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. మరోద్విచక్ర వాహనంపై ఉన్న కోటెబండె ఈశ్వరప్ప (35), నాగరాజప్ప తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఘటనపై అరసికెర ఎస్‌ఐ థారాసింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తమిళనాడులోని నామక్కల్ ప్రాంతానికి చెందిన రఘుపతి (25) పెనుకొండ రూరల్ పరిధిలోని అమ్మవారిపల్లి వద్ద ఉన్న అరుణాచలం ట్రావెల్స్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని గదికి చేరుకున్నాడు. బుధవారం ఉదయం డ్రైవర్ వెళ్లి తలుపు తట్టినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి తొంగి చూశాడు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న రఘుపతి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ రమేష్‌బాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, రఘుపతి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: కుమారుడి మృతితో తీవ్ర మనస్తాపం చెందిన ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురంలోని మారుతీనగర్ నగర్‌కు చెందిన రామచంద్ర (67) కుమారుడు బాల సుబ్రహ్మణ్యం కువైట్‌లో పని చేస్తూ రెండు నెలల క్రితం అక్కడే ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడిపై బెంగతో రామచంద్ర ఇంటి పట్టున ఉండకుండా వీధుల్లో తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలోనే బుధవారం గుడ్డం రంగనాథస్వామి ఆలయం సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై రామచంద్ర భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతంగా జేఎన్‌టీయూ బోధనేతర సంఘం ఎన్నికలు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బోధనేతర సంఘం అధ్యక్షుడిగా పి.జయకృష్ణ గెలుపొందారు. బోధనేతర ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. మొత్తం 113 ఓట్లు పోలు కాగా, 111 ఓట్లు చెల్లుబాటయ్యాయి. పి.జయకృష్ణకు 46 ఓట్లు, పరుశురాం 36 ఓట్లు, శ్రీనివాసులుకు 29 ఓట్లు దక్కాయి. ఎక్కువ ఓట్లు దక్కించుకున్న పి. జయకృష్ణను బోధనేతర సంఘం అధ్యక్షుడిగా ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా వి.రాజేష్ బాబు, సెక్రెటరీగా జి.పుష్పలత, జాయింట్ సెక్రెటరీగా ఎం. ఓబులేసు, కరస్పాండెంట్‌గా ఎస్.లక్ష్మన్న, ట్రెజరర్‌గా బీఎండీ అన్సర్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఎన్నికకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఈ అరుణకాంతి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డాక్టర్ బి.దిలీప్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ చెన్నారెడ్డి వ్యవహరించారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, డాక్టర్ జి.మమత, అజిత, ఏపీ శివకుమార్, కె.కళ్యాణిరాధ తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన పి.జయకృష్ణ, జి.పుష్పలత

కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలి

- బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంకర్లకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. స్టాండప్ ఇండియా, జగనన్న బడుగు వికాసంపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (డీఎల్‌ఆర్సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లను సమన్వయం చేసుకుని పని చేయాలని పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులకు సూచించారు. వివిధ పథకాల కింద అర్హులైన వారికి అవసరమైన రుణాలు విరివిగా మంజూరు చేయించి, కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా, జగనన్న బడుగు వికాసంపై విస్తృత ప్రచారం చేపట్టి, అందిన దరఖాస్తులను పరిశీలించి రుణ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17,821 మందికి రూ.233.98 కోట్ల ముద్ర రుణాలు మంజూరు చేశారని, అవసరాన్ని బట్టి మరింత మందికి రుణాల మంజూరుకు చొరవ చూపాలని ఆదేశించారు. అర్హత కలిగిన వారికి విద్య, పంట రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. జీవన్‌జ్యోతి బీమా, పీఎం సురక్ష బీమా యోజన కింద స్వయం సంఘాల మహిళలతో రూ.20 కట్టించి బీమా సదుపాయం కల్పించాలన్నారు. జగనన్న తోడు పథకం కింద రుణాల మంజూరుపై ఆరా తీశారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద గొర్రెలు, మేకలు, కోళ్లకు,పందుల యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. వీవర్స్ ముద్ర స్కీం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 13,795 దరఖాస్తులు స్వీకరించారని, దాదాపు రూ.184 కోట్లు, స్టాండప్ పథకం కింద 38 ఖాతాలకు రూ.8.36 కోట్ల రుణాల మంజూరుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రెహమాన్, ఏపీజీబీ ఆర్‌ఓ రవీంద్రారెడ్డి, ఎల్‌డీఓ వివేకానంద, డిక్కీ ఫిక్కీ సభ్యులు రమణ, ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అవార్డు అందుకున్న బాషా


ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకుంటున్న మహబూబ్‌బాషా

అనంతపురం కల్చరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డును 'సాక్షి' ఫొటో జర్నలిస్టు డి.మహబూబ్ బాషా బుధవారం అందుకున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ సౌజన్యంతో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఇటీవల ఉత్తమ ఫొటోగ్రాఫర్ల జాబితాను ప్రకటించింది. ఇందులో డి.మహబూబ్‌బాషాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపిక చేయడంతో బుధవారం విజయవాడ వేదికగా సాగిన పర్యాటక దినోత్సవంలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ బాషా చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. పురస్కారంతో పాటు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేస్తూ మహబూబ్‌బాషాను నిర్వాహకులు సత్కరించారు.

పర్యాటక శాఖాధికారికి అవార్డు


నాగేశ్వరరెడ్డి

అనంతపురం కల్చరల్: జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారి అవార్డు దక్కింది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యాటక శాఖ అధికారిగా పనిచేస్తున్నారు. ఆరు దశాబ్దాలుగా పర్యాటక శాఖకు జిల్లాలో సొంత కార్యాలయం లేని విషయాన్ని గుర్తించిన ఆయన, చొరవ తీసుకుని ఎంపీ కోటా నిధులతో కార్పొరేట్ తరహాలో నూతన భవనాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం, దేశంలోనే ఉత్తమ టూరిజం విలేజ్‌గా లేపాక్షికి జాతీయ స్థాయి అవార్డు దక్కడం వెనుక ఆయన పడిన శ్రమకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన అవార్డు అందుకోవాల్సి ఉండగా, జిల్లాలో పర్యాటక వేడుకల నిర్వహణ కారణంగా వెళ్లలేకపోయారు. ఆయన తరఫున అవార్డును పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ దీపక్ అందుకోనున్నారు.

మహిళ దుర్మరణం

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు.... ఎన్‌పీ కుంట మండలం యాదలవాండ్లపల్లికి చెందిన తిమ్మమ్మ (46), నరసింహులు దంపతులు బుధవారం ఉదయం విద్యుత్ సామగ్రి కొనుగోలుకు కొక్కంటి క్రాస్‌కు వచ్చారు. సామగ్రి కొనుగోలు చేసుకున్న అనంతరం ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఉస్తినిపల్లి క్రాస్ సమీపంలోకి చేరుకోగానే వెనుక వస్తున్న ఐచర్ వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని నరసింహులు పక్కకు తిప్పాడు. దీంతో బైక్ అదుపుతప్పి వెనుక కూర్చొన్న తిమ్మమ్మ రోడ్డుపై పడింది. ఆ వెనకనే వస్తున్న ఐచర్ వాహనం చక్రం ఆమె తల మీదుగా దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


ఉపాధ్యాయుల లోటు రానివ్వొద్దు

- డీఈఓకు విన్నవించిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు


డీఈఓ మీనాక్షికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

పుట్టపర్తి అర్బన్: పని సర్దుబాటులో భాగంగా ఏ స్కూలులోనూ ఉపాధ్యాయుల లోటు రానివ్వకుండా చూడాలని డీఈఓ మీనాక్షికి జిల్లా వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అవసరమైన పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను తీసుకోవాలని, అంగవైకల్యం, దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారికి తగిన ప్రాధాన్యతనివ్వాలని కోరినట్లు వివరించారు. వీలైనంత తొందరగా పని సర్దుబాటు ప్రక్రియ ముగించాలని విన్నవించినట్లు తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో వైఎస్సార్‌టీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు పీవీ రమణారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నబీసాహెబ్, రంగధామరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కేశప్ప తదితరులు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు దేవరాజు

రొళ్ల: నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. రొళ్ల మండలం బీజీ హళ్లి పంచాయతీ మల్లసముద్రం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప, పుట్టమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. హనుమంతరాయప్ప మృతి చెందడంతో కుమారుడు దేవరాజు(40)తో కలసి పుట్టమ్మ నివసిస్తోంది. వ్యక్తిగత పనిపై మంగళవారం మధ్యాహ్నం రొళ్లకు వచ్చిన దేవరాజ్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. బుధవారం ఉదయం రగ్నగిరి పంచాయతీ బాజయ్యపాళ్యం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తిమ్మారెడ్డి వ్యవసాయ పొలంలోని నీటి తొట్టెలో దేవరాజ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ముఖంపై రక్త గాయాలు ఉండడంతో దేవరాజ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.